


"ఆ పుస్తకం ఎక్కడిది ?"

"ఎందుకొచ్చిందా అనుమానం?" అన్నట్టుగా చదువుతున్న పుస్తకంలోంచి దృష్టి తిప్పి చూసింది చైతన్య. అది చలం గారు రాసిన "మైదానం".

"అడుగుతున్నది వినిపిస్తుందా? ఆ పుస్తకం ఎక్కడిది అంటే మాట్లాడవే?" ఈసారి కాస్త అసహనంగా వుంది దయానిధి స్వరం.

"రామారావు దగ్గర తెచ్చాను" పేజీ కొస మెలేస్తూ అంది చైతన్య.

"తీసుకొచ్చావా? వాడే తీసికెళ్ళమని యిచ్చాడా?"

"ఏదో అయితే నేం? అయినా ఈ పుస్తకం గురించి ఎందుకంత పట్టుదలగా అడుగుతున్నారు?"

"ఈ పుస్తకం యివ్వటంలో రామారావు వుద్దేశం ఏంటి? నిన్ను కూడా ఆ నవల్లో వకీలు భార్యలా లేచి రమ్మంటాడా?"

"మీ నాన్న రోజూ రామాయణం చదువుతున్నాడు గదా! ఇంతవరకు ఎందరి పెళ్ళాల్ని ఎత్తుకొచ్చాడు?" అని అడుగుదాం అనుకుంది.

"అయినా మీరు నవల్లో వకీల్లా అయినప్పుడు కదండీ!"

"కాకపోతే ఏం? లేచిపో. నాకంటే వాడే ఎక్కువ చదువుకున్నాడు. నాకంటే అందగాడు. నాకంటే ఎక్కువే సంపాయిస్తాడు."

"సందర్భం వున్నా లేకపోయినా ప్రతీదానికి ఆ రామారావు నెందుకు ఆడిపోసుకుంటారు. ఏదో సరదాకి అంటే. మీకే అన్వయించుకోవడం చాలా నీచంగా వుంది."

"అవునవును! వెధవ బూతు పుస్తకాలన్నీ చదివి మాటలుమాత్రం నేర్చావ్. నేను చదవలేదు గా. నాకా విశాలదృష్టి ఎలా వస్తుంది? ఆ పుస్తకాలు రాసిన చలంగాడి కొస్తుంది. రామారావు కొస్తుంది. నీకు..."

"ఆఖరికి నాకు నచ్చిన పుస్తకం చదివే అంత స్వతంత్రం అన్నా లేదా ఈ కొంపలో..."

"ఎందుకు లేదూ...ఉంది. ఇవాళ పుస్తకం చదవటానికి, రేపు నచ్చినవాడితో తిరగడానికి, నేనేమన్నా అభ్యంతరం చెప్తే

లేచిపోవడానికి...'' ఇంకా ఏదో అని లేచిపోయాడు దయానిధి.

చదవబుద్ధికాక పుస్తకం పక్కనపడేసి మంచంమీద పడుకుని దొర్లుతోంది చైతన్య. దయానిధి ఇంతలేసి మాటలన్నందుకు పెద్దగా బాధపళ్ళేదు. కాకపోతే రాత్రంతా కూర్చుని పుస్తకం చదివి ఇదా అర్థం చేసుకున్నదీ అని కాస్త బాధనిపించింది చైతన్యకి.

చైతన్యకి దయానిధికి పెళ్ళయి 10 నెల్లు కావొస్తుంది. చైతన్యకి దయానిధి ఏ విధంగానూ తగడు అన్న అభిప్రాయం వాళ్ళిద్దర్నీ ఎరిగినవాళ్ళందరికీ వున్నట్టుగానే చైతన్యకి, దయానిధికి కూడా వుంది. చైతన్యకి దయానిధి తగకపోవటానికి దయానిధికేం తక్కువ? అని అడిగితే అన్నీ తక్కువే అని చెప్పొచ్చు.

''చంద్రుణ్ణి చూడమని వేలితోటి చూపిస్తే వేలుని చూస్తాట్ట మూర్ఖుడు'' ఎక్కడో చదివిన చైనా సామెత గుర్తొచ్చింది.

''ఈ పెళ్ళి విషయంలో నువ్వు తొందరపడ్డావేమో'' అని సరోజ అన్న మాటలు నిజమేనేమో అనిపిస్తున్నాయ్ ఈ మధ్యన అనుకుంది చైతన్య. మంచంమీద పొర్లుతూ, జ్ఞాపకాల ముళ్ళు గతాన్ని గుర్తు చేస్తుంటే.

* * *

''అప్పుడే చదివేశారా?'' నవ్వుతూ అడిగాడు రామారావ్. ఆ మాట కొస్తే రామారావ్ ఏది మాట్లాడినా నవ్వుతూనే మాట్లాడతాడు.

''ఇంకేమన్నా వున్నాయాండీ...?''

''చలం గారివే కావాలంటే అరుణ, అమీనా వున్నాయ్. అవి వీటంత సులభంగా కొరుకుడు పడవ్. ముందు చలం నవలల్లో స్త్రీ పాత్రల్ని గురించి 'నవీన్' రాసిన సమీక్షా వ్యాసాలున్నాయ్ అవి చదవండి. మధ్యాహ్నం వచ్చేప్పుడు తెస్తా. బెల్ అయింది వెళ్తా. యముడు క్లాస్ రూం ముందు నిలబడి చూస్తున్నాడు'' వెళ్ళిపోయాడు రామారావ్.

స్టాఫ్ రూంలో ఎక్కువ మంది లేరు. వున్న యిద్దరు పంచదార కార్డుల పంపకాల్లో జరిగిన అవకతవకల గురించి, కాసేపు, మిగిలిన టీచర్ల ట్యూషన్ల సంపాదన గురించి కాసేపు పెద్దగా, అసభ్యంగా మాట్లాడుకుంటున్నారు.

విసుగనిపించింది. టేబిల్ మీదున్న పత్రిక తీసింది. పత్రికవాడి మాటల్లో చెప్పాలంటే, ప్రముఖ వార పత్రిక Largest Circulated Weekly అది. కాగితాలు తిప్పింది. విషయసూచిక మళ్ళీ అవే విషయాలు సంపాదకీయంలో. సంపాదకీయం వుండాలి కాబట్టి రాసినట్టే వుంది గానీ, సంపాదకుడు చెప్పాల్సిన వేం లేనట్టే అనిపించింది ఏం సంపాదకుడో circulation సంపాదించుకునే వాణ్ణే ''సంపాదకుడు'' అంటార్ట, రామారావ్ అంటాడు. అభిప్రాయ వేదిక, మీ (మా) పత్రిక, హైలైట్స్, అభిమాన నటుల ముఖ చిత్రం వేసినందుకు కృతజ్ఞతలు. కాగితాలు తిరగేసింది. సినిమా తార జవాబులు, రామారావుగారు, నాగేశ్వరరావ్‌గారు కళామ తల్లికి రెండు కళ్ళలాంటి వాళ్ళు. మా ఇంటికొస్తే తప్పకుండా కలుస్తాను, సినీమా పెళ్ళి సన్నివేశాల గురించి అభిప్రాయాలు ఏడ్చినట్టున్నాయ్, సినీమా సమీక్షలు, అవధుల మేరకు నటన, ప్రతిభావంతమైన నటన, పాత్రలకి న్యాయం చేకూర్చారు. అసలు ఈ పత్రికల్లో సినీమా సమీక్షలు అప్లికేషన్ ఫారాల్లా, నింపటమే తప్పితే మార్పేం లేదు టేబిల్ మీద పడేసి, కళ్ళు మూసుకుని తల వెనక్కి ఆన్చి, పడుకుంది చైతన్య ... కలగా పులగపు ఆలోచనలు, అస్పష్టంగా.

''ఉత్తరం వచ్చింది టీచర్'' ప్యూన్ యిచ్చాడు. కళ్ళు తెరిచింది. సరోజ దగ్గర్నుంచే అనుకుంటూ కవరు చింపింది:''

డియర్ చైతన్య,

నీ ఉత్తరం చదివాను. మళ్ళీ మళ్ళీ

చదివాను. నాకు తెలిసిన చైతన్య, ఉత్తరం రాసిన చైతన్య ఒకరు కాదనిపించింది.

నాన్న కన్నీళ్ళ ముందు నిలబడలేక పోయాను, నాన్న తృప్తికోసం పెళ్ళి చేసుకున్నాను అని రాశావ్. దయానిధి నాకంటే తక్కువ చదివాడు, అనాకారి, సంస్కారం లేనివాడు, రోగిష్టి అసలు యిన్ని కారణాలెందుకు? దయానిధిలో నాకు నచ్చిన అంశం లేనే లేదు. ఇన్ని అయిష్టతలు, ఏహ్యాభావం వున్నా నువ్వతన్ని చేసుకోవడానికి కారణం కేవలం మీ నాన్న కన్నీళ్ళు కన్నీళ్లలో యింత శక్తి వుందని ఇప్పుడే తెలిసింది. నాకు తెలిసిందేమిటంటేయిప్పపువ్వు సారాయే ఎక్కువ మత్తిస్తుందట. యిప్ప పువ్వు సారా కంటే కన్నీళ్ళే ఎక్కువ మత్తెక్కిస్తాయని యిప్పుడే తెలిసింది. మమకారాలు, సెంటిమెంట్స్‌ని మించిన మత్తు పదార్థం లేదని. అర్థమైంది.

అనాలోచితంగా పనులు చేసి, విధిని తిట్టుకుని తమ తెలివి తక్కువ తనాన్ని సమర్థించుకునే వాళ్ళని నేను సమర్థించలేను. ఓదార్చటం నాకు చేతకాదు. ఇది నువ్వు చెయ్యాల్సిన పనికాదు,

నీ, సరూ...

గుండె లవిసేలా ఏడిస్తే బాగుండుననిపించింది

* * *

"రేపు ఆదివారం అమలాపురం వెళ్దామనుకుంటున్నా. సరోజని చూసి చాలా కాలమైంది."

"వెళ్ళనా, వద్దా అని అడిగితే చెప్పొచ్చు గాని వెళ్దామని నిశ్చయించుకున్న తర్వాత అడగటం దేనికి?"

"ముందుగా చెప్తే డూప్లికేట్ కీ దగ్గరుంచుకుంటారని."

"సరోజంటే ఎవరు. పెళ్ళికాకుండా ఓ నలుగురైదుగుర్ని ఉంచుకుందని చెప్పుకుంటారు ఆవిడేనా?"

"కాదు. నా స్నేహితురాలు."

"ఆ అదే ఆ సరోజేశే!"

"నేను మీ స్నేహితులెవరో, ఎలాంటి వారో ఎప్పుడన్నా వ్యాఖ్యానించానా? నాకు తెలీక కాదు. అనవసరం కనక. అయినా ఎవరి గురించైనా నీచంగా మాట్లాడితే బైట పడేది మాట్లాడేవాడి నీచత్వమే."

"అంటే నేను నీచుణ్ణనేగా నీ ఉద్దేశ్యం"

మాట్లాడలేదు చైతన్య.

ఆ పెళ్ళి పెటాకులు లేంది పవిత్రంగా కనిపించే కళ్ళకి నేను నీచుళ్ళా కాక మరెలా కనబడ్తాను."

"ఒంటి తిమ్మిరిని అణుచుకోవటంకోసం మగాడు, జీవితాంతం తిండిపెట్టే అండ కోసం ఆడది సమాజంకోసం చేసుకునే పెళ్ళి, దానికి అక్కర్లేదనుకుంది, దానాదర్శం దాంది. మధ్య మీకెందుకు."

ఒళ్ళమ్ముకు బ్రతకటం కూడా ఒక ఆదర్శం అని తెలీకన్నాను."

"తెలిసిందిగా ఊరుకోండి" విసురుగా లేచి పోయింది చైతన్య.

"అది ఒళ్ళేం అమ్ముకోవట్లేదు ఒకవేళ అమ్ముకున్నా, మెదళ్ళని, చదువునీ అమ్ముకోవడం కంటే నీచమేమీ కాదు." అని అంటే బాగుండేదని పిం చింది.

* * *

డియర్ చైతన్య,

నీ ఉత్తరం అందింది. మీవారు నన్ను గురించి చాలా నీచంగా మాట్లాడారని రాశావ్. ఇంకొకరి అభిప్రాయాల్ని బట్టి నా అభిప్రాయాలు మార్చుకుంటే నా జీవితం యింత తృప్తిగా వుండకపోయేది.

దయానిధే కాదు. చాలామంది పవిత్రులం అనుకునే వాళ్ళు ఆలోచనలకి పరిధుల్ని నిర్ణయించుకున్న వాళ్ళు, ఆ పరిధిని దాటి ఆలోచించలేరు. ఆలోచించినా ప్రవాహానికి ఎదురీదటంలో వున్న థ్రిల్ వాళ్ళకి తెలీదు. ప్రవాహపు నీటిలో కొట్టుకుపోతూ అదంతా వాళ్ళ ఉరవడే అనుకుంటారు.

"ఈపరిస్థితులో నన్నేం చెయ్యమంటావ్" అని రాశావ్. ఏం చెయ్యాలన్నది నువ్వే నిర్ణయించుకో! కాకపోతే ఒకటి.

రామారావుతో లేచిపోతే, నాన్నకెంత అప్రతిష్ట, అమ్మ ఎంత బాధపడ్తుంది, చెల్లెలి పెళ్ళిలా అవుతుంది, కని పెంచి, పెద్ద చేసిన వాళ్ళకి ఈ వయసులో ఇలాంటి

కష్టం కలిగించటం ఎలా...అన్న సంశయాలే నీకెక్కువగావున్నట్టున్నాయ్ అమ్మని నాన్నని గౌరవించటం అవసరమే గానీ, వాళ్ళకి బానిసత్వం చెయ్యటం అనవసరం. ఈ రెంటికీ వున్న తేడా నీకు తెలీదు.

నిన్ను కన్నారు అని రాశావ్ నిన్ను కనాలని కనలేదు. నువ్వే పుట్టావు. నిన్ను పెంచారు అని రాశావ్. పెంచటం ఏంటి? నీ అవసరాల్ని నువ్వు చూసుకునే వయసులో లేనప్పుడు నీ అవసరాల్ని చూశారు. రేపు వాళ్ళ వయస్సు డిగిననాడు, వాళ్ళ అవసరాల్ని నువ్వూ చూడు. అంతేగానీ, కన్నారని, పెంచారని నీ కిష్టం లేకుండా దయానిధితో (నీ మాటల్లో చెప్పాలంటే, పశువుతో) కాపురం చెయ్యటం, దాన్ని తల్లిదండ్రుల మీద అభిమానంతో నువ్వు చేస్తున్న త్యాగం అని అనుకోవడం నీ చేతగాని తనం.

ఒకసారి రాజీ పడగానే సరిపోదు. జీవితాంతం రాజీ పడగలగాలి. ఎదిరించటం కష్టం. ఎదిరిస్తే యింతకంటే ఎక్కువ సుఖ పడ్తాననిపిస్తే ఎదిరించు.

—నీ, సరూ

ఆశ, నిరాశలు, ఒకే క్షణంలో పుడ్తున్నాయ్ చినుకుల్లాంటి ఆలోచనలు... గోడ మీద క్యాలెండర్ కేసి చూసింది. అదిరోజూ చూసేదే అయినా ఈ రోజెందుకు ప్రత్యేకంగా కనిపిస్తోంది! అన్న ఆలోచనతో ఉత్తరం మడుస్తూ మళ్ళీ చూసింది. గుడ్డును పగలగొట్టుకుని సగం బైటికొచ్చిన కోడి పిల్ల బొమ్మ వుంది. ఎందుకో దానికేసే చూస్తూ కూర్చుంది చైతన్య.

మొన్నఆదివారం సరోజ దగ్గరికి వెళ్ళుండాల్సింది. వెధవది, డబ్బులందక పోలేదు. సరోజ నిజంగా ఎంత...తలుపు చప్పుడైంది. దయానిధి వచ్చాడు. పాతరికార్డు కాగితాల్లా వున్నాయ్. గుడ్డలు. దగ్గుతున్న చర్మపు అస్తిపంజరంలా వున్నాడు. ఊగుతున్నాడు. తాగొచ్చినట్టున్నాడు. కళ్ళు పెదాలు బలంగా తెరుచుకుంటున్నాయ్.

''మొగుడొస్తే లేవాలని తెలీదే! పడుకున్నావ్ మహారాణీలా! నడుము వెనకనుంచి చేతులేస్తూ పొట్టకానుకుని కూర్చున్నాడు దయానిధి.

కడుపులో తిప్పినట్టై లేవబోయింది చైతన్య.

''ఒద్దులేవే! పడుకో. ఉట్టినే అన్నాను'' బలవంతంగా పడుకోబెడ్తున్నాడు. నడుం వెనకనుంచి చేతులు తీసి భుజాలమీద వేసి నొక్కుతూ.

సారా కంపు. అసహ్యం, భయం ఒకే సారి కలిగాయి చైతన్యకి. మొఖం అటు తిప్పుకొని లేవబోయింది.

''పడుకోమంటుంటే ఎందుకే లేస్తావ్? కోపం వచ్చిందా, పోనీలే నేనుకూడా పడుకుంటాను. పడుకో...కడుపుమీద తలానించి పడుకున్నాడు దయానిధి.

భరించలేకపోయింది. తోసేస్తూ లేచింది.

'ఛా...ఛా... వెధవల్తోటి తిరిగొచ్చి, అడ్డమైన అలవాట్లు.'

'ఎందుకే లేచిపోతావ్! నాతో పడుకోవా?'

'బుద్ధిలేకపోతే సరి, పట్టపగలు తప్పతాగొచ్చి...'

'అవునే నాకు బుద్ధిలేదు. నాతో మాట్లాడవు నేను. మాట్లాడితే వినవు. నువ్వు నా దగ్గర పడుకోవు. నేను పడుకుంటే లేచిపోతావు ఇంకెందుకే నన్ను పెళ్ళి చేసుకున్నది?'

'ఇందుకే రాత్రనక, పగలనక తాగి, ఆంబోతులా నువ్వు రంకెలేస్తుంటే, నీనరాల దురదల్ని తీరుస్తూ, ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో అని మురుద్దాం' అని

'దొంగముండా, నన్నే తిడుతున్నావే... నా ఇంటికొచ్చి, నన్నే...' జుట్టు పట్టుకు బైటికి తోసుతున్నాడు.

కోపం అసహ్యం, జుగుప్స, తెగువా ధైర్యం, ఎదిరింపు, అన్నీ, ఒక్కసారే కలిగాయి చైతన్యకి, దయానిధి చేతుల్లోంచి జుట్టు వదిలించుకుని దయానిధిని తోసేసింది. దేనికో తగిలినట్టున్నాడు క్రింద పడ్డాడు. కిటికీ దగ్గరకొచ్చింది, కిటికీలోంచి శూన్యం

(మిగతా 48వ పేజీలో)